క్లుప్తంగా

పోలీస్ స్పందనలో 80 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనలో 80 మంది నుంచి డీసీపీ విశాల్ గున్ని ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 18, కుటుంబ కలహాలపై 12, ఆస్తి వివాదాలపై 12 ఫిర్యాదులు, మోసాలపై 13, ఇతర సమస్యలపై 25 మంది ఫిర్యాదులందజేశారు. బాధితులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులకు డీసీపీ ఆదేశాలిచ్చారు.

15 నుంచి రైల్వే క్రికెట్ టోర్నమెంట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 15 నుంచి డిసెంబర్ 22 వరకు విజయవాడ డివిజన్‌లో 7వ డీఆర్ఎమ్ కప్ ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రైల్వే పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పలు విభాగాల నుంచి 12 టీమ్‌లు పోటీ పడనున్నాయని పేర్కొన్నారు. అందులో మెకానికల్ అండ్ సీఅండ్‌డబ్ల్యూ, ఆర్‌పీఎఫ్, కమర్షియల్, ఎలక్ట్రికల్ లోకోషెడ్డు (ఈఎల్ఎస్), డీజిల్ లోకో షెడ్డు (డీఎల్ఎస్), ఆపరేటింగ్, అకౌంట్స్, పర్సనల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్/మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ (టీఆర్‌ఓ), సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ విభాగాలు ఉన్నాయన్నారు. విజయవాడ రైల్వే స్టేడియంలో జరిగే మ్యాచ్‌లలో ప్రాథమిక దశలో నాకౌట్ పద్ధతిలో 20 ఓవర్‌ల మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు 25 ఓవర్ల పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి 2024 మార్చిలో జరిగే దక్షిణ మధ్య రైల్వే ఇంటర్ డివిజనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో అన్న ప్రసాద వితరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సోమవారం సాయంత్రం సంధ్యాసమయంలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పంచహారతులసేవ నిర్వహించారు. ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఏటా కార్తీక మాసం చివరి రోజు అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఈఈ ఎల్.రమాదేవి, ఏఈవో ఎన్.రమేష్‌బాబులు ప్రారంభించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు పర్యవేక్షించగా, ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ కెఎల్ రావు నగర్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ ఫోర్‌మెన్ బంగ్లా ఫీడర్ పరిధిలో మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఫోర్‌మెన్ బంగ్లా ఏరియా, యూసఫ్ ఖాన్ వీధి, ఫ్రైజర్‌పేట, ఎర్రకట్ట ఏరియా తదితర ప్రాంతాల్లో ఆయా సమయాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రామవరప్పాడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన సోమవారం గూడవల్లి జాతీయ రహదారిపై జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ వన్‌టౌన్‌లో వస్త్రలత కాంప్లెక్స్‌లోని దుస్తుల దుకాణంలో పి.నాగరాజు (25), షేక్ షహనాజ్ (25) పని చేస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఇరువురు ద్వారకా తిరుమల దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో గూడవల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి వెనక నుంచి కారు వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, షహనాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



45వ డివిజన్ సచివాలయంలో అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డ్ ఆవిష్కరించిన వెలంపల్లి, మాధురి లావణ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు 3648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేయటం, తద్వారా వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారంలోకి రాగానే నవరత్నాలు పేరుతో మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ కబేళా రోడ్‌లోగల సచివాలయంలో సోమవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయ పరిధిలోని ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి చేసిన ఖర్చు వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో అర్హతగల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఈ రాష్ట్రానికి ఎంతైనా ఉందన్నారు. మీకు మేలు జరిగిందనుకుంటేనే నాకు ఓటు వేయండని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెబుతున్నారంటే ఆయన పారదర్శక పాలనపై అంత నమ్మకం ఉందని స్పష్టం అవుతుందన్నారు.

అక్కడ బీజేపీతో..ఇక్కడ టీడీపీతో...

పార్టీ పెట్టి పదేళ్లు కావస్తున్నా ఇంకా రాజకీయ పరిపక్వత లేని వ్యక్తి పవన్ కల్యాణ్‌అని, అతని అవిత్ర పొత్తే కాదు, నిలకడ.. పొంతన లేని మాటలే అందుకు నిదర్శనమని వెలంపల్లి విమర్శించారు. తెలంగాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న పవన్ కల్యాణ్, ఏపీకి వచ్చేసరికి టీడీపీతో జత కట్టడాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని అన్నారు. చంద్రబాబు తెలివిగా తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయకుండా పవన్ కల్యాణ్‌ను బద్నాం చేసేందుకే అక్కడ 8 స్థానాల్లో నిలబెట్టించాడని ఎద్దేవా చేశారు. ఒక్క కూకట్‌పల్లిలో మినహా మిగతా స్థానాల్లో జనసేన పార్టీకి డిపాజిట్లు కూడా దక్కకపోవడంతో రానున్న ఏపీ ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకుని చంద్రబాబును ఇన్ని సీట్లు కావాలని డిమాండ్ చేయగలడని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు భవిష్యత్ శూన్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షులు షేక్ గౌస్‌మొహిద్దీన్, పార్టీ నాయకులు ముత్తా వాసు, దుర్వేసుల హుస్సేన్, బైపినేని కోటేశ్వరరావు, గుండు శ్రీను, ముత్యాల రాంబాబు, దావాల బుజ్జి, సుంకర నారాయణ, సీహెచ్ లక్ష్మణ్, డీ రాము, నల్లం వాసు, గుండు లక్ష్మి, ఆర్ కోటేశ్వరి, కె భాను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సచివాలయానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇచ్చిన మాటను నెరవేర్చే నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 48వ డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సచివాలయానికి విచ్చేసిన పలువురు స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పొందిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిట్టినగర్ కేటీ రోడ్డు పరిధిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు సంక్షేమ పథకాలను రూపకల్పన చేయడమే కాకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయి.. జగన్ ప్రభుత్వంలో ఏ మేరకు హామీలను అమలు చేశామనే విషయాన్ని ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ శీరం వెంకట్రావు, యంగల శ్రీనివాసరావు, వానపల్లి త్రిమూర్తులు, చంద్రశేఖర్, నాగోతి చంటి, వెంకటలక్ష్మీ, వరలక్ష్మీ, దుక్కా హరి, భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు అండగా ప్రభుత్వం



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న యువన్యాయవాదులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లా నేస్తం వంటి పథకాల ద్వారా యువ న్యాయవాదులకు అండగా నిలుస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాపు అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాన్ని ఆ సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ యువ న్యాయవాదులు వృత్తిపరంగా ఇబ్బందులు పడకుండా, వారికి అండగా నిలిచి భవిష్యత్‌లో ఉన్నతంగా తీర్చిదిద్దేందు లానేస్తం వంటి పథకాలు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నరహరశెట్టి జ్యోతి పలువురు యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

హరహర శివ.. శంభో శంకర..

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- పలు ఆలయాల్లో దీపాలంకరణ సేవ



రామలింగేశ్వర స్వామి సన్నిధిలో దీపార్చనలో భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు శివాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజామున పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శివాలయాలకు విచ్చేసి స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపించుకున్నారు. కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపం, దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, ఉభయదాతలు, భక్తులు దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు. అనంతరం శివలింగాకృతిలో ఏర్పాటు చేసిన దీపాలను భక్తులు వెలిగించి పూజలు నిర్వహించారు. దీపాలంకరణకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది.

చిట్టినగర్‌లో...

శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ శమీ సమేత కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ శర్మలు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించగా, పలువురు భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

భీమన వారిపేటలో...

భీమన వారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి భస్మామిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కేటీ రోడ్డుపై ఏర్పాటు చేసిన దీపోత్సవాన్ని పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించగా, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీకుమార్, పలువురు ఉభయ దాతలు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



దీపార్చనలో పాల్గొన్న భక్తులు



మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో స్వామి వారికి కల్యాణోత్సవం



రామలింగేశ్వర స్వామికి భస్మాభిషేకం

నగరవాసులు కాచి చల్లార్చిన నీటినే తాగాలి

పటమట(విజయవాడతూర్పు): తుఫాన్ కారణంగా విస్తారంగా కురిసిన వర్షాలతో భవానీపురంలోని హెడ్‌వాటర్ వర్క్స్‌లో నీటిలో టర్బోడిటీ అధికంగా పెరిగిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టర్బోడిటీ అధికంగా పెరగటంతో హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి నగరానికి తాగునీటి సరఫరా చేయటానికి ప్లాంట్ నుంచి డిశ్చార్జ్ కెపాసిటీ తగ్గిందని దీని ప్రభావం నగరవాసులపై పడకుండా కాచి చల్లార్చి తాగాలని, తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్పీఎఫ్ సిబ్బంది విధులను అడ్డుకోవడం సరికాదు

ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో విధి నిర్వహణలో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది విధులను అడ్డుకోవడం సరైంది కాదని ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీఎస్ఉఎన్ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో కృష్ణలంక ఏఎస్సై , ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మధ్య జరిగిన ఘటనపై ఆయన స్పందించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో కృష్ణలంక ఏఎస్ఐ శ్రీనివాసులు తన కుటుంబంతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చారన్నారు. దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో అమ్మవారి నివేదన ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. అమ్మవారికి నివేదనకు ఎదురుగా వెళ్తున్న ఏఎస్ఐ కుటుంబాన్ని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పక్కకు వెళ్లాలని సూచించారని చెప్పారు. నివేదన సమయంలో ఎవరూ అమ్మవారి ఊరేగింపుకు అడ్డురాకుండా చూడాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ రత్నారెడ్డి తమకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆయన ఆదేశాల మేరకే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఏఎస్ఐ కుటుంబాన్ని పక్కకు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. నన్నే పక్కకు వెళ్లమంటావా అంటూ ఏఎస్ఐ ఎస్పీఎఫ్ సిబ్బందిపై వివాదానికి దిగారన్నారు. నివేదనకు వస్తున్న క్రమంలో ఎదురుగా ఎవరూ రాకూడదనే ఆంక్షలు ఉండడంతోనే తమ సిబ్బంది అలా చెప్పారన్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించకుండా ఎస్పీఎఫ్ సిబ్బంది తప్పుగా ప్రవర్తించారని ఫిర్యాదు చేయడం, మీడియాకు సమాచారం అందించడం జరిగిందన్నారు. ఈ విషయంపై హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాసరావు, ఏఎస్ఐ శ్రీనివాసులు ఇద్దరిని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పిలిపించి విచారించారన్నారు. విచారణలో ఎస్పీఎఫ్ సిబ్బంది తప్పులేదని, ఆంక్షల నేపథ్యంలోనే పక్కకు తొలగాలని సూచించడం జరిగిందని తేలిందన్నారు. సీఐ సూచనల మేరకు ఎస్పీఎఫ్ సిబ్బందిపై ఏఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారని స్పష్టం చేశారు.

స్పందన సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మేయర్, కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం సిద్ధంగా ఉండాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 15 సమస్యలు వీరి దృష్టికి రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపై-10, ఇంజినీరింగ్ విభాగంపై-2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)పై-2, ఉద్యానవన విభాగంపై-1కు సంబంధించి అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, అడిషనల్ కమిషనర్(జనరల్) కే శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ రావు, సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, పీవో (యుసిడి) రోహిణి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఆర్.యఫ్.ఓ. వెంకటేశ్వరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, వీఏఎస్ డాక్టర్ రవి చంద్ పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కార్తిక దీపోత్సవం..

కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో భక్తులు కృష్ణానదిలోని దుర్గాఘాట్‌లో స్నానమాచరించి కార్తికదీపాలు వెలిగించారు. అనంతరం శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. చల్లపల్లి బంగ్లా వద్ద ఉన్న శివాలయంతో పాటు వన్‌టౌన్, మొగల్రాజపురంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









ఆర్థిక ఇబ్బందులతో హిజ్రా ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో హిజ్రా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మేడిబోయిన వరలక్ష్మి కుటుంబం బంగారయ్య కొట్టు సందులో నివాసం ఉంటుంది. వరలక్ష్మి భర్త వెంకట్రావుతో విభేదాల కారణంగా వేరుగా ఉంటుంది. ఆమెకు ముగ్గురు సంతానం కాగా, కుమారుడు సురేష్ అలియాస్ తేజశ్రీ తన 15వ ఏటనే హిజ్రాగా మారిపోయాడు. అయితే కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తేజశ్రీ ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. అమ్మమ్మను ఇంటి నుంచి బయటకు పంపిన తేజశ్రీ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లి వరలక్ష్మి ఇంట్లో ఉరికి వేలాడుతున్న తేజశ్రీని కిందకు దింపి 108లో సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

వాహనాల చోరీపై కేసు

పెనమలూరు: మండల పరిధిలో పలు ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా ద్విచక్ర వాహనాల వరుస చోరీలపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శివాలయం ప్రాంతానికి చెందిన పులి తరుణ్ సిద్ధార్థ కాలేజీ సమీపంలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటారు. ఆయన తన బైక్‌పై ఆఫీసుకు వచ్చి బైక్‌ను బయట పార్క్ చేశాడు. పనులు ముగించుకుని వచ్చి చూడగా బైక్ కనపడలేదు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాలంకరణ నడుమ శివలింగాకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర కార్తీక మాసం ఆఖరి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా విద్యాధరపురం కబేళా రోడ్‌లోని మాదాసు రామారావు వీధిలోగల శ్రీనిలా అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన సహస్ర దీపాలంకరణ మహోత్సవం వైభవంగా జరిగింది. అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పలు కుటుంబాల సభ్యులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో పూలతో శివలింగాకారాన్ని తీర్చిదిద్దారు. శివలింగానికి ఒక వైపు ఓం, మరో వైపు స్వస్తిక్ రూపాలను పూలతో అలంకరించారు. వాటిపై ప్రమిదలను ఏర్పాటు చేసి 365 వత్తులను పెట్టి వెలిగించారు. దీపాలంకరణ నడుమ అవన్నీ దేదీప్యమానంగా వెలుగొందుతూ వెలుగులతో నిండిపోయింది. శివ స్వాములు, మహిళలు పెద్ద ఎత్తున ఈ దీపాలంకరణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఓం నమఃశ్శివాయ..హర హర శంభోశంకర నామస్మరణంతో శ్రీనిలా అపార్ట్‌మెంట్ మార్మోగింది.